# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 157 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

23-04-2026 గురువారం వెల : 1/- పేజీలు : 4


## జడ్పీ సమావేశంలో ఉద్ధానం తాగునీటి సమస్యలపై ఆగ్రహం

- భూగర్భ జలాల సమస్యలపై ముందస్తు ప్రణాళిక అవసరం
- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మందుల సరఫరా తక్షణమే చేయాలి
- వాటర్ ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్‌పై ఆదేశాలు
- ఉపాధి హామీ, వ్యవసాయ సమస్యలపై సమీక్ష
- జడ్పీ సమావేశంలో ప్రజా సమస్యలపై విస్తృత చర్చ
- జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ సూచనలు







2లో

## లోకేష్‌కు అండగా మెంటాడ స్వరూప్

- ప్రాణాపాయ స్థితిలో చికిత్స
- కుటుంబానికి భరోసా
- రూ.10 వేలు ఆర్థిక సాయం
- మెరుగైన వైద్యం అందించాలని సూచన

2లో





## వ్యవసాయ మంత్రి ఇలా కాలో ప్రారంభానికి నోచుకోని విత్తన శుద్ధి నిల్వ కేంద్రం




- రైతు సంక్షేమాన్ని పట్టించుకోని సీఎం చంద్రబాబు నాయుడు....
- రైతు సంక్షేమ దృష్టితో తక్షణమే విత్తన శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించాలి.....
- టెక్కలి వైయస్సార్ సిపి ఇన్చార్జ్ పేరాడ తిలక్.

4లో

## రాజకీయాలు సేవా రంగమా? వ్యాపారమా?

- ఈపీఎఫ్ ఉద్యోగుల కనీస పెన్షన్ పెంపుపై కేంద్రంపై విమర్శలు
- ప్రజాప్రతినిధులకు జీవితాంతం రాయితీలు.. సమానత్వంపై ప్రశ్నలు
- వృద్ధులు, జర్నలిస్టులు, నిరుద్యోగుల సమస్యలపై చర్చ ఎక్కడ?
- ప్రజాస్వామ్య విలువల రక్షణకు యువత ముందుకు రావాలి
- శిరిగిరి వరదరాజు ఫౌండర్ చైర్మన్, నవ చైతన్య యువజన సేవాసమితి

2లో



## "మాచన" మానవత్వం

ప్రాణం కాపాడిన సివిల్ సప్లైస్ డి టి



నల్లగొండ మునుగోడు మార్గం బుధవారం మధ్యాహ్నం 2 గంటలు ప్రాతం.
మునుగోడు ధాన్యం సేకరణ కేంద్రాల తనిఖీ కి వెళ్తున్న పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్ మానవత్వం తో.. ఓ వ్యక్తి ప్రాణం కాపాడారు.
వివరాల్లోకి వెళ్తే. ఓ వ్యక్తి గుడాపూర్ సమీపం లో రోడ్డు పక్కన పడి ఉన్నాడు.శ్వాస తప్ప మాట లేదు. ఎండ వేడిమి తీవ్రంగా ఉంది.హైదరాబాద్ లో తనకు తెలిసిన ఓ డాక్టర్ కు పరిస్థితి ఇలా ఉంది ఏమ్ చేయాలి అని అడిగారు.వడ దెబ్బ తగిలి ఉంటుంది.లేదా ఏదైనా క్రిమి కరచి ఉంటుంది ముందు ఉప్పు నీళ్లు తాగించండీ అని సూచించారు.రఘునందన్ తన వద్ద ఉన్న ఉప్పు,చక్కర కలిపిన నీళ్లను తాగించారు.

-మిగతా 2లో

## స్వాతంత్ర్య స్ఫూర్తితో డ్రగ్స్‌పై పోరాటం



3లో



## కంపోస్టు కాలనీలో ఉన్న సచివాలయం సందర్శన

### భవనాలకు ప్లానింగ్ లేకపోతే పెనాల్టీ వేయాలి



**నవతరం -శ్రీకాకుళం**

భవనాలకు ప్లానింగ్ లేకపోతే పెనాల్టీ వేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కంపోస్టు కాలనీలో ఉన్న వార్డు సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ట్యాక్స్ కలెక్షన్లు ఎలా చేస్తున్నారో కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. భవనాలకు అనుమతులు లేకుండా ఎన్ని భవనాలు ఉన్నాయి, అలాంటి చర్యలు తీసుకున్నది లేనిది, ఎన్టీఆర్ వైద్య సేవ కార్డు పంపిణీ, ఎంత మంది ఉన్నారు వారందరికీ కార్డులు పంపిణీ పూర్తి అయ్యింది లేనిది అడిగి తెలుసుకున్నారు. న్యూట్రీషన్ కు సంబంధించి కమిటీ ఎప్పుడు సమావేశం నిర్వహించారని కలెక్టర్ అడుగగా గత నెలలోనే సమావేశమైనట్లు సచివాలయం సంక్షేమం అసిస్టెంట్ చెప్పారు. సచివాలయానికి వచ్చిన ప్రజలతో ఎలా మాట్లాడాలో సూచించారు, సచివాలయంలో కంప్యూటర్ లు ఉన్నది లేని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ నెల మూడు సచివాలయాలు సందర్శనలో భాగంగా ఆమదాలవలస, పలాస, టెక్కలి, శ్రీకాకుళం సచివాలయాలను సందర్శించినట్లు వివరించారు. ప్రతీ అధికారి గ్రామ, వార్డు సచివాలయాలను సందర్శిస్తే కింది స్థాయి సిబ్బంది బాగా పని చేస్తారని, ఫలితంగా అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. ఈ సందర్శనలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హెచ్. కూర్మారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడిటోరియల్

# మోడీ పెడబొబ్బలు

ప్రజల్లో నిత్యం విధ్వంసం, విద్వేషాలను రగిలించడం ద్వారా ఓట్లు దండుకునే పన్నాగాలను అవపోసన పట్టిన కమలనాథులు ఆ పనిలో అనుక్షణం నిమగమయ్యే ఉంటారు. ఇందుకు తాజా ఉదాహరణే ప్రధాని జాతినుద్దేశించి చేసిన ప్రసంగం. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో చేసిన ప్రసంగంలో ఆయన అడుగడుగునా ప్రతిపక్షాలపై విద్వేషాన్ని వెళ్లగక్కారు. దీన్ని కూడా ఎన్నికల ప్రచారానికే ఉపయోగించుకున్నారు. తమిళనాడు, పశ్చిమబెంగాల్ పేర్లను ప్రత్యేకించి ప్రస్తావిస్తూ... "దేశంలోని తల్లులకు, కుమార్తెలకు క్షమాపణలు చెబుతున్నా" అంటూ మొసలికన్నీళ్లు పెట్టుకుంటూ నీచ రాజకీయాలకు పాల్పడ్డారు. తన పక్షపాత రాజకీయ ప్రసంగానికి ప్రభుత్వ ప్రసార సంస్థ అయిన దూరదర్శన్‌ను సైతం దుర్వినియోగం చేశారు.

బిల్లు వీగిపోయిన దగ్గర నుండి ప్రతిపక్షా లను ముఖ్యంగా కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీపై విరుచుకుపడుతున్నారు. బిల్లును ఓడగొట్టిన కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్‌లను మహిళలు ఎప్పటికీ క్షమించరనే శాపనార్థాలు మొదలుపెట్టారు. శనివారం తమిళ నాడు, ఆదివారం బెంగాల్ ఎన్నికల ప్రచారంలో కూడా ఇదే విషయాన్ని పదేపదే వల్లెవేశారు. మహిళలు చట్టసభల్లోకి అడుగు పెట్టడం కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్‌లకు ఏమాత్రం ఇష్టంలేదని ఆరోపిం చారు. రెండుచోట్ల ప్రచారంలో కూడా ఇదే విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించటం చూస్తే రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడాన్ని రాజకీయం గా ఎలా ఉపయోగించుకుంటున్నారో స్పష్టంగా తెలుస్తోంది.

పార్లమెంట్‌లో గురువారం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపక్షాలు ఐక్యంగా తిప్పికొట్టాయి. అయితే దాన్ని మహిళా బిల్లుగా ప్రధాని సహా కమలనేతలు చిత్రించే ప్రయత్నాలు చేస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు, మహిళా రిజర్వేషన్‌పై విమర్శలను అడ్డుకోవడానికి ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో 'నారీ శక్తి వందన్ అధినియం' (ఎన్.ఎస్.వి.ఎ)ను హడావిడిగా ఆమోదించింది. ఈ ఆమోదించిన బిల్లును అమలులోకి తెచ్చే ఉద్దేశమే ఉంటే 2024 ఎన్నికల నుండే రిజర్వేషన్లు అమలయ్యేవి. కానీ మోడీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్‌ను జనగణన, పునర్విభజనతో ముడిపె ట్టింది. ఈ అనవసరమైన లంకెల వల్ల రిజర్వేషన్ల అమలు అనిశ్చితిలో పడుతుందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేసినా, ప్రభుత్వం ఆ భయాలు నిరాధారమని కొట్టిపారేసింది. 2024 ఎన్నికలు పూర్తయిన వెంటనే డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని, జనగణన కూడా నిర్దిష్ట సమయానికల్లా పూర్తి చేస్తామని ఆనాడు మోడీ ప్రభుత్వం నమ్మబలికింది. కానీ, ఈ రెండూ వాస్తవ రూపం దాల్చలేదు. దానికి కారకులెవరు?

2023లో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును 2024 ఎన్నికల్లోనే అమలు చేయాలని అప్పట్లో ప్రతిపక్షాలు ఎంత డిమాండ్ చేసినా మోడీ ఏమాత్రం ఖాతరు చేయలేదు. పోనీ ఇప్పుడు మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్, జమిలి ఎన్నికల బిల్లులను వేర్వేరుగా ప్రవేశపెట్టమని ప్రతిపక్షాలు ఎంత చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదు, వినిపించుకోలేదు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేషన్‌తో లింకు పెట్టి, పనిలో పనిగా జమిలి ఎన్నికల బిల్లులను కూడా ఆమోదింప చేసుకునేందుకు మోడీ ప్లాన్ చేశారు. అందుకనే ఎలాంటి మొహ మాటం లేకుండా ఇండియా బ్లాక్, ఎన్డీయేతర పార్టీలు ఏకమై ఈ రాజ్యాంగ సవరణ బిల్లు ఓడగొట్టాయి.

బిల్లు వీగిపోవటంలో మోడీ బాధ్యత కూడా వుంది. ఎలాగంటే, రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి ఎన్డీయేకి తగినంత మెజారిటి లేదన్న విషయం ప్రధానికి, ప్రభుత్వానికి స్పష్టంగా తెలుసు. అయినా ఓటింగ్ దాకా పరిస్థితిని ఎందుకు తెచ్చారు? ఎందుకంటే వ్యూహాత్మకంగానే తెచ్చారని అర్థమవుతోంది. మోడీ వ్యూహంలో రెండే అంశాలున్నాయి. మొదటిదేమో మహిళా సెంటిమెంటును ముందుకు తెచ్చి బెంగాల్, తమిళనాడు ఎన్నికలలో లబ్ది పొందడం తప్ప అంతకు మించి మహిళా రిజర్వేషన్ పట్ల ఆయనకు ఏ చిత్తశుద్ధి లేదు. బిల్లు వీగిపోతుందని వారికి ముందే తెలుసు. తలచినదే జరిగిన తర్వాత... ఇప్పుడు తమ వ్యూహంతో భాగంగా ప్రతిపక్షాలను దోషులుగా చిత్రీకరిం చటం మొదలుపెట్టారు. తమిళనాడు, బెంగాల్ ఎన్నికల్లో మహిళల ఓట్లను గంపగుత్తగా బీజేపీ, ఎన్డీయే అభ్యర్థులకు వేయిం చుకోవటమే లక్ష్యంగా ప్రచారం చేసుకుంటున్నారు. "మహిళా బిల్లును అడ్డుకొని భ్రూణ హత్యకు పాల్పడ్డాయి" అని విపక్షాలపై నిందారోపణలు చేస్తున్నారు. నిందను ప్రతిపక్షాలపైకి నెట్టి ఎన్నికల్లో లబ్ది పొందడానికే ప్రభుత్వం ఈ పథకం వేసింది. లేదంటే ఆమోదం పొందిన బిల్లును నేరుగా అమలులోకి తేకుండా జనగణన, డీలిమిటేషన్‌తో మెలిక పెట్టడమెందుకు? ప్రభుత్వం తన మాయాజాలం ఆపి, ఎటువంటి శషభిషలు లేకుండా మహిళలకు రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలనుకుంటే అడ్డుపడేవారెవరు? ఎవరూ లేరు. సారాంశంలో గుర్తించాల్సిందేమిటంటే దోషి మోడీ సర్కారే...

# రాజకీయాలు సేవా రంగమా? వ్యాపారమా?

**నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం:**

దేశంలో సుమారు 80 లక్షల ఈపీఎఫ్ (జ్యూఖీ) ఉద్యోగులు కనీస పెన్షన్ పెంపు కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. జీవితాంతం కష్టపడి పనిచేసిన కార్మికులకు 60 ఏళ్ల తర్వాత కూడా తగిన ఆర్థిక భద్రత లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

ఇదే సమయంలో ప్రజాప్రతినిధులకు కేవలం ఐదేళ్ల పదవీకాలంలోనే విస్తృత సౌకర్యాలు, జీవితాంతం రాయితీలు లభించడం సమానత్వ సూత్రాలకు విరుద్ధమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వృద్ధులకు అందుతున్న ప్రయాణ రాయితీలు తగ్గించడంపై కూడా అసంతృప్తి పెరుగుతోంది.

అలాగే దేశవ్యాప్తంగా సీనియర్ జర్నలిస్టులకు ఏకరీతిలో పెన్షన్, ఆరోగ్య భద్రతా విధానాలు లేకపోవడం కూడా ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు నిరుద్యోగం తీవ్రంగా ఉన్నప్పటికీ, పార్లమెంట్‌లో ఈ సమస్యలపై తగిన చర్చ జరగడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును మరోసారి ప్రవేశపెట్టడం, దానిని డీలిమిటేషన్ ప్రక్రియతో అనుసంధానం చేయడం రాజకీయ ప్రయోజనాల కోసమేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఉన్న స్థానాల్లోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయవచ్చని కొందరు సూచిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్య రాజకీయాలు సేవా ధోరణి నుంచి దూరమై, పెట్టుబడిదారీ ప్రభావానికి లోనవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. సామాజిక న్యాయం, సమానత్వం, సంక్షేమం వంటి విలువలు క్రమంగా కనుమరుగవుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

ఈ నేపథ్యంలో యువత, మేధావులు, సామాన్య ప్రజలు ప్రస్తుత పరిణామాలను సమగ్రంగా విశ్లేషించి, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందని పిలుపునిస్తున్నారు.

# లోకేష్‌కు అండగా మెంటాడ స్వరూప్

**నవతరం శ్రీకాకుళం**

మహాలక్ష్మి నగర్ కాలనీకి చెందిన దుర్రి రమణ కుమారుడు దుర్రి లోకేష్ నిన్న పైడిబీమవరం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, హెడ్ ఇంజరీతో ప్రాణాపాయ స్థితిలో కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. లోకేష్ కుటుంబం ఆర్థికంగా బలహీనంగా ఉన్న నేపథ్యంలో, వైద్య చికిత్స కోసం మెంటాడ వెంకట స్వరూప్ వ్యక్తిగతంగా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. భవిష్యత్తులో అవసరమైతే మరింత సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈరోజు ఆసుపత్రికి వెళ్లిన మెంటాడ స్వరూప్, బాధితుడు లోకేష్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి లోకేష్‌కు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రస్తుతం వైద్యులు శస్త్రచికిత్స నిర్వహిస్తూ ప్రాణాలను కాపాడేందుకు శ్రమిస్తున్నారు.

ఈ సందర్భంగా మహాలక్ష్మి నగర్ కాలనీ యువత కూడా పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి అందరూ సహాయం చేయాలని కోరారు.

# "మాచన" మానవత్వం

మొదటిపేజీ తరువాయి

కాసేపటికి తేరుకున్నారు. అతన్ని లేపి కూర్చోబెట్టి. మీది ఎక్కడ,ఎక్కడికి వెళ్తున్నారు అని అడిగితే తనది పులిపలుపుల అని తన పేరు సైదులు అని చెప్పాడు.నల్లగొండ కు పని మీద పోతున్న సార్ అని చెప్పాడు.తన వద్ద ఉన్న ఆరటీ పళ్ళు తినిపించి,వ్యక్తి పూర్తిగా హుశారు అయ్యాక..అతన్ని ఓ ఆటో ఎక్కించి,ఇతన్ని నేరుగా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళు అని సూచించి పంపారు.

# జడ్పీ సమావేశంలో ఉద్దానం తాగునీటి సమస్యలపై ఆగ్రహం

**నవతరం -శ్రీకాకుళం**

ఉద్దానం ప్రాంతంలో తాగునీటి పైపులైన్లలో లీకేజీలను వెంటనే అరికట్టి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జడ్పీ సీఈవో వెంకటరామన్ సమక్షంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజా సమస్యలపై సభ్యులు సూచనలు చేయగా వాటిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఉద్దానం ప్రాంతంతో పాటు టెక్కలి, సంతబొమ్మాళి, హిరమండలం ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు, పైపులైన్ లీకేజీలు, నీటి కొరతపై సభ్యులు ప్రస్తావించారు.

వాటర్ ట్యాంకులను శుభ్రపరచడంతో పాటు క్లోరినేషన్ పద్ధతిగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డుల జారీ, కార్మికుల ఖాతాల అప్డేషన్, గ్రామాల్లో పెండింగ్ పనులపై సమీక్షించారు. వంగర మండలంలో మొక్కజొన్న పంటకు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు.

ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సికెడి మందులు సకాలంలో అందడం లేదని సభ్యులు ప్రస్తావించగా, వెంటనే సరఫరా పునరుద్ధరించాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. సోంపేట డయాలసిస్ యూనిట్ మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

కవిటి, సోంపేట, పాతపట్నం ప్రాంతాల్లో లో వోల్టేజ్ సమస్యలు, రైతులకు విద్యుత్ బిల్లులు, సాంఘిక సంక్షేమ హాస్టళ్ల భద్రత, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు పరిహారం వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది.

ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణతోనే సుస్థిర భవిష్యత్తు




**నవతరం శ్రీకాకుళం**

ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణను ఒక బాధ్యతగా స్వీకరించినప్పుడే భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన ధరిత్రిని అందించగలమని విజయనగరం జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ కె.ఆర్.డి. ప్రసాద్ పిలుపునిచ్చారు.

ప్రపంచ ధరిత్రి దినోత్సవం పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి. జగన్మోహన్ రావు ఆదేశాల మేరకు బుధవారం నగరంలో భారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రసాద్ గారు తొలుత విద్యార్థుల అవగాహన ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు.

అనంతరం రెడ్‌క్రాస్ పరిపాలనా భవనంలో నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవంలో ఆయన మాట్లాడుతూ..

మట్టి ప్రాముఖ్యతను గుర్తించి, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి కనీస ధర్మమన్నారు. విద్యార్థులు పర్యావరణ హిత చర్యలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

అవగాహన ర్యాలీని ఆదిత్య డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ కె. శివశంకర్, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఎంసీ కమిటీ సభ్యులు డాక్టర్ నిక్కపన్న, పి. శ్రీకాంత్, బి. చిన్మయిరావు, పి. వైకుంఠరావు, ప్రతినిధులు కె. సత్యనారాయణ, జి. రమణ, పి. చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకార గ్రామాల సమస్యలకై సైకిల్ యాత్ర

## - సైకిల్ యాత్ర విజయవంతం కావాలి



**నవతరం శ్రీకాకుళం**

ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యకార గ్రామాల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో శ్రీకాకుళం జిల్లా వాసి, గూడెల ప్రసాద్ ఇచ్ఛాపురం నుండి నెల్లూరు వరకు సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఈ యాత్రలో భాగంగా మార్గమధ్యంలోని మత్స్యకార గ్రామాలను సందర్శిస్తూ అక్కడి ప్రజల సమస్యలు, జీవన పరిస్థితులను పరిశీలించి వాటిని సోషల్ మీడియా ద్వారా ప్రజలకు పాలకులకు తెలియజేయాలని ఆయన సంకల్పించారని, పొట్నూరు సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా "సమాచార హక్కు చట్ట సమన్వయ కమిటీ తరఫున, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నందుపల్లి బాలరాజు, రాష్ట్ర ఛైర్మన్ పొట్నూరు సురేష్ కుమార్, గూడెల ప్రసాద్‌కు గేర్ల సైకిల్ ను అందజేసి యాత్ర విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. దీనిలో భాగంగా సంస్థ యొక్క ప్రధాన ఉద్దేశ్యం సమాచార హక్కు చట్టం 2005ను ప్రోత్సహించడం, రక్షించడం, ప్రభుత్వ కార్యాలయాలలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను నెలకొల్పడంలో ఆర్టిఐ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న ఆర్టిఐ కార్యకర్తలందరిని ఒక వేదికపైకి తీసుకురావడం, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించడం లక్ష్యంగా సంస్థ పనిచేస్తోందని, ఆసక్తి ఉన్నవారు సంస్థలో చేరవచ్చని రాష్ట్ర ఛైర్మన్ పొట్నూరు సురేష్ కుమార్ పిలుపునిచ్చారు.

# "కన్న తండ్రి విలువ... దూరమైనప్పుడు తెలుస్తుంది!"




పెన్షన్లు, టీఎస్ఆర్టీసీ బలోపేతం – సాధారణ జీవితానికి ఊరట ఇచ్చాయి.
ఇవి వాగ్దానాలు కాదు... ఇవి చేసి చూపించిన పనులు.
ఇప్పుడు పరిస్థితి మారింది అని చెబుతున్నారు...
కానీ ప్రజలు అనుభవిస్తున్నది ఏమిటి?
రైతు బంధు ఆలస్యం...
రైతు బీమా అనిశ్చితి...
నీటి సమస్యలు మళ్లీ కనిపిస్తున్నాయి...
విద్యుత్ లోపాలు వినిపిస్తున్నాయి...
డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నెమ్మది...
ఆరోగ్య సేవల్లో అసంతృప్తి...
ఉద్యోగాల విషయంలో అయోమయం...
పథకాల కొనసాగింపుపై సందేహాలు...
ఇది విమర్శ కాదు... ప్రజల మనసులో ఉన్న ప్రశ్న.
ప్రజలు ఇప్పుడు ఒకటే అడుగుతున్నారు:
మార్పు కోసం తీసుకున్న నిర్ణయం...
మన జీవితాలను మెరుగుపరిచిందా?
లేక మళ్లీ వెనక్కి తీసుకెళ్లిందా?
నాయకత్వం అంటే మాటలు కాదు...
సంక్షోభంలో నిలబడి చూపే ధైర్యం.
అభివృద్ధి అంటే ప్రకటనలు కాదు...
ప్రజల జీవితాల్లో కనిపించే మార్పు.
మరొక్కసారి గుర్తు పెట్టుకోవాల్సిన మాట:
"పిల్లి శాపానికి ఉట్టి పడదు...
అలాగే... నిజంగా పని చేసిన నాయకుడి విలువ...
కాలమే నిరూపిస్తుంది."
తెలంగాణ నిర్ణయం ఎప్పుడూ ఒకటే ఉండాలి –
అభివృద్ధి వైపు...
స్వాభిమానం వైపు...
మన భవిష్యత్తు వైపు.
ఇవి మా మాటలు కావు
ప్రజల అనుభవాల తూటాలు

అలాగే... నాయకుడి విలువ కూడా అతను లేకపోతేనే బాగా అర్థమవుతుంది. ఇవి మాటలు కావు... ఇవి తెలంగాణ చూసిన నిజాలు.
తెలంగాణ కోసం సంవత్సరాల పాటు పోరాడింది ఒక వ్యక్తి మాత్రమే కాదు...
ఒక ఆలోచన... ఒక ఆవేదన... ఒక అగ్ని.
ఆ అగ్ని రూపమే –కల్వకుంట్ల.చంద్రశేఖరరావు.
ఆయన నాయకత్వంలో వచ్చిన మార్పులు మాటల్లో చెప్పేవి కాదు...
ప్రజల జీవితాల్లో కనిపించే వాస్తవాలు.
రైతు బంధు – రైతు గుండెల్లో నమ్మకం నింపింది.
రైతు భీమా – కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచింది.
మిషన్ భగీరథ – ప్రతి ఇంటికీ నీళ్లు అందించింది.
24 గంటల విద్యుత్ – వ్యవసాయానికి ప్రాణం పోసింది.
డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు – పేదలకు గౌరవం ఇచ్చాయి.
ఆరోగ్యశ్రీ, కేసీఆర్ కిట్ – ప్రజల ఆరోగ్యానికి రక్షణగా మారాయి.
రోడ్లు, అభివృద్ధి – తెలంగాణ రూపురేఖలను మార్చాయి.
కాళేశ్వరం ప్రాజెక్ట్ – నీటి శక్తిని నేలకు చేర్చింది.
మహిళల భద్రత, సంక్షేమం – సమాజానికి బలం ఇచ్చాయి.

**ఉద్దేశకుడు:**
**తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా**

# మహనీయుల మంత్రాలు..!




గౌతమ బుద్ధుని...
మంత్రం...శాంతి శాసనం...
చంచల చిత్తానికి చల్లని చరణం...
బుద్ధం బాట...భయానికి బంధనం
ధమ్మం ధర్మం...దుర్మార్గానికి దండనం
సంఘం శక్తి...సంసారానికి సంరక్షణం..!

జీజస్ క్రైస్ట్...
మంత్రం...ప్రేమ ప్రబోధం
కఠిన హృదయానికి కరుణ కవచం
ప్రేమకు ప్రతిరూపం...పగకు వ్యతిరేకం
అడుగు అడుగున...క్షమకు ఆహ్వానం
విముక్తికి...విశ్వశాంతికి...విజ్ఞానదీపం..!

స్వామి వివేకానందుని...
మంత్రం...జగతిలో జాగృతి జ్వాల
నిద్రించే నరాలకు నిప్పుల నినాదం
లే మేల్కో పరుగుఆపకు లక్ష్యాన్ని చేరుకో
దీన జనోద్దరణతోనే దైవ సాక్షాత్కారం...
ఆత్మవిశ్వాసం...అజేయానికి ఆయుధం..!

మహాత్మా గాంధీజీ...
మంత్రం...నీతికి నినాదం
కల్మష కలహాల కట్టడికి కవచం
చెడు వినకు...
చెడు పలకకు...
చెడు చూడకు...
అహింస ఆచరణ...
ఆగ్రహానికి ఆక్షేపన...
సత్యం శివం సుందరస్వరం...
సమాజానికి శాశ్వత శాసనం...!

డాక్టర్ బిఆర్ అంబేద్కర్...
మంత్రం...సమానత్వపు సింహనాదం
బానిసత్వ విముక్తికి బలమైన పునాది
బోధించు...బలాన్ని...బుద్ధిని...జ్ఞానాన్ని
సమీకరించు...శక్తిని...సమరానికి సైఅంటూ
పోరాడు...స్వేచ్ఛా...స్వాతంత్ర్యాల కోసం ...
సమానత్వం..సౌభ్రాతృత్వాలకోసం..పిడుగువై



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# స్వాతంత్ర్య స్ఫూర్తితో డ్రగ్స్‌పై పోరాటం

**నవతరం -శ్రీకాకుళం**

స్వాతంత్ర్య స్ఫూర్తితో డ్రగ్స్‌పై పోరాటానికి అందరూ ముందుకు రావాలని ఖాదీ గ్రామీణ పరిశ్రమల సమన్వయకర్త జి.ఎస్.ప్రసాద్, కూన సన్యాసిపాత్రో పేర్కొన్నారు. వైబ్రెంట్ కలాం సంస్థ ఆధ్వర్యంలో వంద అడుగుల జాతీయ జెండాతో శ్రీకాకుళం పట్టణంలోని ఆసుపత్రి జంక్షన్ నుంచి గాంధీ మందిరం వరకు యువత బుధవారం ర్యాలీ నిర్వహించారు. వందేమాతరం నినాదాలు చేస్తూ గాంధీ మందిరం చేరుకున్న నిర్వాహకులు, యువత బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పోరాటానికి మద్దతుగా నిలుస్తామన్నారు. భావితరాలు డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. దేశానికి సంపదగా నిలుస్తున్న యువత నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిపై సమిష్టిగా యుద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల ప్రతినిధులు నక్క శంకరరావు, దేవకన్య, పందిరి అప్పారావు, పిట్టా భాగ్యచంద్ర, చింతాడ రామచంద్రరావు, బుడుమూరు సూర్యారావు, పెంకి చైతన్య, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఏడాది మరో హీరోయిన్ పెళ్లి?

సంయుక్త మీనన్ పై పెళ్లి పుకార్లు కొత్తేం కాదు. ఆమె పెళ్లిపై ఏడాదిన్నర కిందటే గట్టిగా రూమర్లు వినిపించాయి. అయితే వాటిని ఆమె ఖండించింది. ఓ సినిమా ప్రచారంలో మాట్లాడిన సంయుక్త, తన పెళ్లి వార్తల్ని పక్కనపెట్టాలని, తనలో నటిని చూడాలని, నటన పరంగా ఏమైనా సలహాలుంటే ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది.
ఆ తర్వాత సంయుక్తపై పుకార్లు ఆగిపోయాయి. అలా ఆగిన వెడ్డింగ్ రూమర్స్ మళ్లీ ఇప్పుడు గుప్పుమంటున్నాయి. 30 ఏళ్ల ఈ మలయాళీ ముద్దుగుమ్మ ఈ ఏడాది పెళ్లి చేసుకునే అవకాశం ఉందంటూ ప్రచారం మొదలైంది.
ప్రస్తుతం ఆమె కెరీర్ పీక్ స్టేజ్ లో ఉంది. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుసపెట్టి సినిమాలు చేస్తోంది. ఇలాంటి టైమ్ లో ఆమె పెళ్లిపై పుకార్లు రావడం విచిత్రమే. మరికొంతమంది మాత్రం రష్మిక తరహాలో సంయుక్త కూడా పెళ్లి చేసుకొని కెరీర్ కొనసాగిస్తుందని చెబుతున్నారు.
త్వరలోనే ఆమె స్వయంభు సినిమాతో ప్రేక్షకుల ముందుకురాబోతోంది. దీంతోపాటు ఆమె బ్లాక్ గోల్డ్ అనే సినిమా కూడా చేస్తోంది. తాజా పెళ్లి పుకార్లపై సంయుక్త ఎలా స్పందిస్తుందో చూడాలి



# 6 సినిమాలు.. మిగిలింది ఈ ఒక్క రోజు



ప్రస్తుతం మార్కెట్లో 6 సినిమాలున్నాయి. ఒక్కో సినిమా ఒక్కో స్టేజ్ లో ఉంది. ఈ సినిమాలకు మిగిలిన ఒకే ఒక్క లైఫ్ లైన్ ఈరోజు మాత్రమే. ఈరోజు వచ్చే వసూళ్లు ఈ సినిమా జాతకాల్ని డిసైడ్ చేయబోతున్నాయి.
మొన్న 3 సినిమాలొచ్చాయి.
తిమ్మరాజుపల్లి టీవీ, పాపం ప్రతాప్, బ్యాడ్ బాయ్ కార్తీక్ సినిమాల్లో నాగశౌర్య నటించిన బ్యాడ్ బాయ్ కార్తీక్ మూవీ వెంటనే ఫ్లాప్ అయింది. రేపట్నుంచి ఆడుతుందనే గ్యారెంటీ లేదు. కాబట్టి ఆ సినిమాకు ఈరోజు వచ్చే వసూళ్లే నికరం అనుకోవాలి.
ఇక తిమ్మరాజుపల్లి టీవీ, పాపం ప్రతాప్ చిన్న సినిమాలు. టాక్ సంగతి పక్కనపెడితే, సోమవారం నుంచి ఈ సినిమాలకు ఆక్యుపెన్సీ ఆశించడం అత్యాశే అవుతుంది. ఈ వీకెండ్ వసూళ్లే ఈ రెండు సినిమాలకు కీలకం. తర్వాత సంగతి తర్వాత.
ఇక వీటికంటే ముందొచ్చిన డెకాయిట్ ది మరో పరిస్థితి. తాజాగా ఈ సినిమా 50 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసినట్టు మేకర్స్ ప్రకటించుకున్నారు. నంబర్ చూడ్డానికి పెద్దగానే అనిపించినా, వాస్తవ పరిస్థితి వేరు. శనివారం వసూళ్లను మినహాయిస్తే, ఈ సినిమా బ్రేక్ ఈవెన్ అవ్వాలంటే అటుఇటుగా మరో 12 కోట్ల రూపాయల వసూళ్లు రావాలి. మిగిలింది ఈ ఒక్క రోజు మాత్రమే. డెకాయిట్ కంటే ముందొచ్చిన రాకాస, బైకర్ సినిమాలది అదే పరిస్థితి. బైకర్ తన కెరీర్ లో సక్సెస్ ఫుల్ మూవీ అని చెప్పుకుంటున్నాడు హీరో శర్వానంద్. నిర్మాతలు మాత్రం అలా చెప్పుకోలేని పరిస్థితి. ఇక రాకాస సినిమా అరకొరగా మాత్రమే గట్టెక్కింది. ఈ రోజుతో ఈ 2 సినిమాలు దాదాపు క్లోజింగ్ కు వచ్చేసినట్టే. ఇలా ఈ 6 సినిమాలకు డిసైడింగ్ ఫ్యాక్టర్ గా మారింది ఈ ఆదివారం. వచ్చే వారం కూడా చెప్పుకోదగ్గ సినిమాల్లేవు.

# "పుడమి సంరక్షణకు రైతులు బాధ్యత తీసుకోవాలి"

## -పర్యావరణ ఇంజనీర్ కరుణశ్రీ




**నవతరం-లావేరు**

భూమి, నీరు, గాలి కాలుష్యాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ కరుణశ్రీ అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం చేపడితే నేల కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. అలాగే, రసాయన మందులను పిచికారీ చేసే సమయంలో స్ప్రింక్లర్ పద్ధతి ఉపయోగిస్తే జల కాలుష్యాన్ని నియంత్రించవచ్చని సూచించారు.
పంట కోతల తర్వాత అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నడం వలన భూసారం పెరుగుతుందని, పొలం గట్లపై కొబ్బరి, తాటి వంటి చెట్లు పెంచినట్లయితే గాలి వేగాన్ని నియంత్రించి పంటలు నేలమట్టం కాకుండా కాపాడటం, కాలుష్యం తగ్గడంతో పాటు మట్టి సారవంతత పెరుగుతుందని వివరించారు.
అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ గారి ఆదేశాల మేరకు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో భాగంగా పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు అందిస్తున్నామని చెప్పారు. రెడ్, ఆరెంజ్, గ్రీన్ కేటగిరీలలో వరుసగా ఒకటి, మూడు, ఏడు రోజుల్లో అనుమతులు మంజూరు చేస్తున్నామని, సింగిల్ విండో విధానంలో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.
ధరిత్రీ దినోత్సవం ప్రతి ఏటా ఏప్రిల్ 22న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటామని భూమి పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, కాలుష్య నియంత్రణ, చెట్ల పెంపకం, నీటి సంరక్షణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం దీని ప్రధాన ఉద్దేశ్యమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు.
కార్యక్రమం అనంతరం "ప్రతి ఇంటికి ఒక మొక్క" కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలను పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.జగన్నాధరావు, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి. తవిటినాయుడు, గ్రామ పెద్దలు, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భూమాత సంరక్షణ సకల జీవకోటికి ప్రాణదారం



రాజం సిఐ హెచ్ ఉపేంద్ర

**నవతరం -శ్రీకాకుళం**

భూమాతను రసాయనాల బారి నుండి ప్లాస్టిక్ నుండి రక్షిస్తే సకల జీవకోటి ఆరోగ్యంగా ఉంటుందని రాజాం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతు ఉపేంద్ర అన్నారు బుధవారం రాజాం ప్రభుత్వ పాఠశాలలో జరిగిన అంతర్జాతీయ దరిత్రి దినోత్సవం లో ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పంచభూతాలపై అవగాహన కల్పించారు ముందుగా ప్రకృతి వ్యవసాయం రైతు పెంకిగౌరీశ్వరరావు పొలం నుండి సేకరించిన సారవంతమైన మట్టికి పూజలు చేశారు ఈ సందర్భంగా రాజాం మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రావు మాట్లాడుతూ రైతులు రసాయనాలు వాడకుం డాపంటలు పండించాలని అలాగే చెట్లను విరుగుగా పెంచి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు జాతీయ రైతు నేస్తం అవార్డు గ్రహీత ప్రకృతి వ్యవసాయం రైతు పెంకి గౌరీశ్వరరావు మాట్లాడుతూ రసాయన ఎరువులు పురుగుమందులతో భూమిని పర్యావరణాన్ని ప్రకృతిని నాశనం చేస్తున్నామని రసాయన ఎరువులు మితిమీరి వాడటం వల్ల భూమాత ఆరోగ్యం క్షీణించిందన్నారు. ఆ భూములలో పండినఆహారం తిన్న మానవాళి రోగాలు పాలవుతున్నారని విద్యార్థి దశ నుండే పిల్లలు రసాయన ఎరువులతో పండిన ఆహారం వలన జరిగిన నష్టాన్ని తెలుసుకొని తల్లిదండ్రులలో కుటుంబాలలో ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించాలని అన్నారు హై స్కూల్ హెచ్ఎం రాంప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారంతో ఆరోగ్యవంతమైన జీవనంతో విద్యార్థులు భవిష్యత్తులో భావి పౌరులుగా ఎదుగుతారు అన్నారు స్టాఫ్ సెక్రటరీ బివి అధ్యక్ష కుమార్ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడితే ప్రకృతిని మనల్ని రక్షిస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో దామోదరావు మరియు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం రైతు గౌరీశ్వరరావును ఘనంగా సత్కరించారు
ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర 2047 మేనేజర్ ఫణి కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయ సాధనకు స్వర్ణాంధ్ర సాధనకు అందరూ భాగస్వాములు కావాలన్నారు.

# శ్రీ చైతన్యలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



- 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు సన్మానం
- 6వ తరగతిలోకి అడుగుపెడుతున్న చిన్నారులకు అభినందనలు
- అతిథుల సందేశాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి
- విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఆకాంక్షలు

**నవతరం -శ్రీకాకుళం**

మహాలక్ష్మి నగర్ కాలనీ శ్రీకాకుళం-1, శ్రీ చైతన్య పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసుకుని 6వ తరగతిలోకి అడుగుపెడుతున్న విద్యార్థుల కోసం 'గ్రాడ్యుయేషన్ డే' వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మరియు పాఠశాల యాజమాన్యం విచ్చేసి విద్యార్థులను అభినందించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ ఎం. వి. సురేష్ గారు, Executive AGM - VSP, KKD, RJYD Regions, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి శ్రీ చైతన్య పునాది వేస్తుందని కొనియాడారు. మరో అతిథి శ్రీ ఎం. రామి నాయుడు గారు, Regional Incharge - SKLM, మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గారు,రాం ప్రసాద్ గారు విద్యార్థులకు ఇప్పటివరకు మీరు ప్రాథమిక విద్యలో ఒక చిన్న ప్రపంచంలో పెరిగారు. ఇప్పుడు మీరు 6వ తరగతిలోకి, అంటే హైస్కూల్ విభాగంలోకి అడుగుపెడుతున్నారు. అక్కడ మీకు కొత్త సవాళ్లు, కొత్త విషయాలు ఎదురవుతాయి. వాటిన్నిటినీ ధైర్యంగా, ఉత్సాహంగా స్వీకరించండి అని తెలిపారు. తరువాత పట్టాలను అందజేస్తూ, భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్స్, హైస్కూల్, ప్రైమరీ మరియు ప్రీప్రైమరీ ఎకడమిక్ కోఆర్డినేటర్స్, వివిధ విభాగాల ఇంచార్జీలు, జోనల్ ఏ.ఓ మరియు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఎదుగుదలను చూసి ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

# ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల వద్ద గ్రీన్ షెడ్లు ఏర్పాటు చేయాలి

- ఎండల తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు
- వృద్ధులు, పిల్లలు, రోగులకు ఉపశమనం అవసరం
- చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలి
- ప్రజాప్రతినిధులు, అధికారులకు చలపతిరావు విజ్ఞప్తి



**నవతరం -శ్రీకాకుళం**

వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా శ్రీకాకుళం నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల వద్ద గ్రీన్ క్లాత్ షెడ్లు ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త, అడ్వకేట్ వై. చలపతిరావు ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలల్లో ఎండలు తీవ్రంగా ఉంటున్నాయని, నగరంలో ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల వద్ద వాహనాలు ఆగిన సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, రోగులు, చిన్నపిల్లలు ఎండ వేడికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.
ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ సిగ్నల్ కూడళ్ల వద్ద గ్రీన్ క్లాత్ షెడ్లు ఏర్పాటు చేయడంతో పాటు మంచినీటి సదుపాయం కల్పించే చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల సౌకర్యార్థం అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని చలపతిరావు విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా శ్రీ సాయి విద్యా మందిర్‌లో గ్రాడ్యుయేషన్ డే

- ప్రైమరీ చిన్నారులకు పట్టాల ప్రదానం
- పిల్లల కోసం రోజూ గంట సమయం కేటాయించండి
- వైద్యుల సూచనలు, తల్లిదండ్రులకు పిలుపు
- సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి




**నవతరం -శ్రీకాకుళం**

నగరంలోని పి.ఎన్ కాలనీలో గల శ్రీ సాయి విద్యా మందిర్ స్మార్ట్ స్కూల్ లో ప్రైమరీ విద్యను పూర్తి చేసిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బూరగాపు లక్ష్మణరావు మాస్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మూల వెంకట్రావు, డాక్టర్ సీపాన రాజేష్, ప్రముఖ ఈఎన్టీ స్పెషలిస్ట్ డాక్టర్ పైడి సింధూర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపిల్లల మనసు ఎంతో సున్నితమైందని, వారిపై ఒత్తిడి లేకుండా ఆడుతూ పాడుతూ నేర్చుకునే విధంగా విద్య అందించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ప్రతిరోజూ కనీసం గంట సమయం కేటాయించాలని, మానవ సంబంధాలు, నైతిక విలువలు చిన్నప్పటి నుంచే బోధించాలని పేర్కొన్నారు.
పిల్లలు సైంటిఫిక్ అప్రోచ్ పెంపొందించుకోవాలని, వారి ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ సీపాన లక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్పర్సన్ చౌదరి ధనలక్ష్మి, అకడమిక్ ఇంచార్జ్ పి. సీతామహాలక్ష్మి, ఇంచార్జీలు తవిటి రాజు, కోటి, లీడ్ కోఆర్డినేటర్ రాజేశ్వరి చౌదరి, ప్రోగ్రాం ఆర్గనైజర్ పాతిన స్వాతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మంత్రి ఇలా కాలో ప్రారంభానికి నోచుకోని విత్తన శుద్ధి నిల్వ కేంద్రం

**నవతరం టెక్కలి**

నేడు బుధవారం నందిగామ మండలం బడ బందా గ్రామ సమీపంలో గత ప్రభుత్వములో నిర్మించబడి ప్రస్తుతం ప్రారంభోత్సవానికి నోచుకోని విత్తన శుద్ధి నిల్వకేంద్రాన్ని టెక్కలి నియోజకవర్గం వైసిపి ఇన్చార్జ్ పేరడ తిలక్ మరియు నాయకులు కార్యకర్తలు సందర్శించారు. ఈ సందర్భంగా పేరాడ తిలక్ మీడియా మిత్రులతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి హయాంలో రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని విత్తన శుద్ధి కేంద్రాన్ని నాలుగున్నర కోట్ల రూపాయలతో నిర్మాణం జరిగిందని మరో నాలుగున్నర కోట్లతో యంత్ర పరికరాలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉన్నప్పటికీ నేటి ప్రభుత్వం రెండేళ్లు గడుస్తున్న వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న అచ్చం నాయుడు తన సొంత నియోజకవర్గంలో ఉన్న ఈ కేంద్రాన్ని ప్రారంభోత్సవం కు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే దేనిని ప్రారంభోత్సవం చేపట్టకపోతే రైతాంగం తరపున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తిలక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా నియోజకవర్గ మండల అనుబంధ విభాగ నాయకులు కార్యకర్తలు మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**